ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 31-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- వికసిత భారత్ 2047 లక్ష్య సాధనకు నూతన బడ్జెట్ విశ్వాసాన్ని, శక్తిని నింపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రేపు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు.
- అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలలో భారత మహిళల జట్టు ఫైనల్ కు చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భముగా రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం అపూర్వమైన వేగంతో పనిచేస్తోందని, సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనే దృక్పథంతో ప్రజల సంక్షేమానికి భరోసా ఇస్తోందని అన్నారు. మేక్ ఇన్ ఇండియా నుంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ మేక్ ఫర్ ది వరల్డ్‌గా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2047 నాటికి దేశంలోని భావితరాలు అభివృద్ధి చెందిన, బలమైన, సమర్థమైన, సంపన్నమైన భారతదేశాన్ని చూస్తాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

(వాయిస్..34 సెకన్లు)-నెట్

కాగా.. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా గురించి రాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ఈ ఆధ్యాత్మిక వేడుక దేశ సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవల తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రద్ధాంజలి ఘటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో పార్లమెంటులో రేపు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కొత్త విశ్వాసాన్ని, శక్తిని నింపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, దేశాన్ని నడిపించే బాధ్యతను ప్రజలు మూడోసారి తమ ప్రభుత్వానికి ఇచ్చారని, ఈసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా 75 ఏళ్లు పూర్తి చేసుకుని ప్రపంచ పీఠంపై సుస్థిరత సాధించిందని పేర్కొన్నారు. ఎప్పటిలాగే ఈ సమావేశాల్లో ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు, చర్చలు జరుగుతాయని, దేశ బలాన్ని పెంచే విధంగా చట్టాలు రూపొందిస్తామని తెలిపారు. ప్రతి మహిళకు కుల, మత భేదాలు లేకుండా గౌరవమైన జీవితం, సమాన హక్కులు కల్పించేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు ప్రధాన మంత్రి వివరిస్తూ...

(వాయిస్..44 సెకన్లు)-నెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఈరోజు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆర్థిక సర్వేను సమర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం మధ్యాహ్నం పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. రేపు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈరోజు ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయి. తొలివిడతగా ఫిబ్రవరి 13వ తేదీ వరకూ,

రెండోవిడతగా మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. కాగా నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం వరుసగా ఇది ఎనిమిదోసారి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ ఈరోజు పార్లమెంటులో సమర్పించిన ఆర్థిక సర్వే.. వ్యవసాయం, సేవల రంగం మద్దతుతో దేశం స్థిరమైన ఆర్థికవృద్ధిని ప్రదర్శిస్తోందని పేర్కొంది. అనుకూల వ్యవసాయ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ ఉత్పత్తి, రికార్డు స్థాయిలో మెరుగుపడుతుందని వెల్లడించింది. ఆర్థిక క్రమశిక్షణ, వాణిజ్య సేవల మిగులు స్థూల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని సర్వే పేర్కొంది. 2025 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వాస్తవ GDP 6.4 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 6.3, 6.8 శాతం మధ్య ఉంటుందని ఈ ఆర్థిక సర్వే వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అభివృద్ధిలో మహిళలు  కీలక పాత్ర పోషిస్తున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ మహిళా కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రాజ్యాంగం చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించిందన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ఉపరాష్ట్రపతి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ లో వ్యవసాయం రంగం దేశ జిడిపి వృద్ధిలో ప్రధాన రంగంగా నిలుస్తుందని కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) డాక్టర్ వి. అనంత్ నాగేశ్వరన్ అన్నారు. పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన అనంతరం న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిడిపి వృద్ధి పరంగా వ్యవసాయం వాటాను 0.75 శాతం నుండి ఒక శాతానికి పెంచడానికి అవకాశం ఉందన్నారు.  మైక్రో ఇరిగేషన్ విస్తీర్ణం మూడు రెట్లు పెరిగిందని తెలిపారు. గత పదేళ్లకుపైగా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించడంతో సానుకూల ఫలితాలను ఇచ్చిందన్నారు. కొత్త విమానాశ్రయాలు, రైళ్లు, ఓడరేవులు అందుబాటులోకి రావడం, తద్వారా ప్రయాణ సదుపాయాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్తు రంగంలో ఉత్పత్తి పెరుగుదల, డేటా వ్యయం తగ్గింపు, టెలికామ్ ఇన్ఫ్రా విస్తరణ కీలక విజయాలు సాధించాయని వివరిస్తూ...

(వాయిస్..42 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్ -19 మహిళల టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలలో భారత మహిళల జట్టు ఫైనల్ కు చేరుకుంది. ఈరోజు ఇంగ్లండ్‌తో జరిగిన రెండో సెమీస్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న  ఇంగ్లండ్ జట్టు 113 పరుగులకు మొత్తం వికెట్లను కోల్పోయింది. భారత్ 15 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి 117 పరుగులు చేసి గెలుపొందింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచులో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =